అనవసర విమర్శలు మానుకోవాలి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనసాగిన కాలంలో మహిళలకు పావలా వడ్డీ రుణాలు మంజూరు చేశారని, కష్టాజలాలు తాగునీటి కోసం సరఫరా చేశారని బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అనవసర విమర్శలు మానుకోవాలని టీపీసీసీ కార్యదర్శి అయూబ్‌ఖాన్ హితవు పలికారు. మంగళవారం బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి పై, కాంగ్రెస్ పార్టీపై చేసిన విమర్శలను తిప్పి కొట్టారు. కాకగూడలోని తన కార్యాల యంలో మీడియా సమావేశంలో అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ కేంద్ర రక్షణమంత్రిత్వ శాఖ నుంచి 8వందల కోట్ల రూపాయలకు పైగా సర్వీర్‌చార్జీలు విడుదల చేయించ డంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్, నామినేటెడ్ సభ్యుడు రామకష్ణ విఫలమయ్యారని ఇందుకు బీజేపీ నేతలు సిగ్గుపడాలని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితిలో బొల్లారం ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంపీ నిధులు విడుదల చేశారని పలు అభివద్ధి పనులు చేపట్టారని అన్నారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం



మంత్రిని కలిసిన ఓయూ జేఏసీ నేత కొత్తపల్లి తిరుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుదని ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి నేతృత్వంలో విద్యార్థులు మంత్రిని కలసి నిరుద్యోగుల సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అధిక ప్రాధానత్యను ఇవ్వనున్నట్లు మంత్రి హామి ఇచ్చినట్లు తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో పులిగంటి వేణుగోపాల్, శివశంకర్, సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో అధికారుల ఇష్టారాజ్యం

లాలాపేట: బోనాల ఉత్సవాల ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని అధికారులు తమకు నచ్చిన విధంగా ఇస్తున్నారని శ్రీ నల్ల పోచమ్మ టెంపుల్ కమిటీ అధ్యక్షుడు జింకల హరికృష్ణ ఆరోపించారు. బుధవారం తార్నాకలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. చిన్న ఆలయాలకు లక్షల్లో ఇస్తూ భక్తులు అధికంగా వచ్చి బోనాల సమర్పించే ఆలయాలకు అరకొరగా చెక్కులను పంపిణీ చేయడం సరైంది కాదన్నారు. బోనాల పండుగ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపు నెం. 6 పరిధిలోని తమ గుడికి సుమారు రెండు లక్షల ఖర్చు వస్తుందని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నప్పటికీ కేవలం రూ.16వేల చెక్కు మాత్రమే ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల సిఫార్సులు, ఉన్నతాధికారుల రికమండేషన్లు ఉన్న దేవాలయ కమిటీలకు మాత్రం రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు చెక్కులను ఇస్తున్నారని పేర్కొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



సదస్సులో మాట్లాడుతున్న దీపక్ జాన్

రసూల్‌పురా: రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. మైనార్టీ క్రిస్టియన్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో తిరుమలగిరి లాల్‌బజార్ గారిసన్ చర్చిలో క్రైస్తవ సదస్సు బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దీపక్ జాన్ మాట్లాడుతూ.. కన్వర్టడ్ క్రిస్టియన్ల కుల ధృవీకరణ పత్రాలు, చర్చిల నిర్మాణంలో అనుమతి పొందే విధంగా చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. క్రిస్టియన్ మైనార్టీ విద్య, ఉపాధికి కార్పొరేషన్ సహాయసహకారాలు అందజేస్తుందని హామీచ్చారు. కార్యక్రమంలో ఇథియోపియన్ సివిల్ సర్వీసెస్ యూనివర్సిటి ప్రతినిధి డాక్టర్ కే. జాన్ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అలర్జీ, ఆస్తమాఎక్స్‌లెన్స్ సెంటర్ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో అలెర్జీ, అస్తమా ఎక్సలెన్స్ సెంటర్‌ను ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీవ్రమైన అస్తమాతో బాధపడుతున్న వ్యక్తులకు అధునాతన చికిత్సలు అందజేస్తామన్నారు. డాక్టర్ రమణ ప్రసాద్, కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ సంబిత్ సాహు, పల్మనాలజీ, ఈఎన్‌టీ బృందాలు పాల్గొన్నాయి.

ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు కృషి



ట్యాంక్‌బంగ్‌పై ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బెల్లయ్య నాయక్

కవాడిగూడ: ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్య విగ్రహాన్ని నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే విధంగా తమ వంతు కృషిచేస్తానని తెలంగాణ గిరిజన కోఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పేర్కొన్నారు. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట నాయకులు సదానందం, కోనేటి నర్సింహ, రవికుమార్, వనం రమేష్, ఆనంద్, పుత్తాడి సురేష్, మొగులయ్య, మహిళా అధ్యక్షురాలు భవాని, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శన భాగ్యం.. జన్మ ధన్యం

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు సమర్పించారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని శ్రీవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు.



స్వామి వారికి లక్ష తులసీ దళాల అర్చన

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, జెక్‌కాలనీ, మోడల్‌కాలనీ, సుందర్‌నగర్, ఉదయ్‌నగర్, ఆదిత్యనగర్ తదితర కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చిలకలగూడ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలగూడలోని పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బుధవారం వేకువజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో కోటి తులసీదళార్చన, లక్ష పుష్పార్చన, నామ సంకీర్తన, సంగీత విభావరి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణుగోపాలరావుల నేతృత్వంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు. చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయంలో ట్రస్టీ నాగులూరి సాయిబాబా, నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ నోముల ప్రకాశరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని పలు దేవాలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలతో పాటు తొలి ఏకాదశి వేడుకల సదర్భంగా స్వామి వారికి ఏకాంత అభిషేకాలు, తిరువారాదన, ధన్వంతరి హవనము తదితర పూజలు చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, లస్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్ ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్ సింగ్, ధర్మకర్తలు విక్రం, అజయ్ ఆనంద్, సోమయ్య, సాయితేజ, సందీప్‌కుమరా తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



పుష్ప,తులసీదళాలతో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో కార్పొరేటర్ కొంతం దీపిక పూజలు

భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోండి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



దేవాలయ పరిసర ప్రాంతాల్లో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రాంగోపాల్‌పేట్: ఈ నెల 21,22వ తేదీల్లో జరుగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మహంకాళి దేవాలయానికి వచ్చిన కలెక్టర్ ఆర్డీవో దశరథ్, తహసీల్దార్ పాండునాయక్, జీహెచ్ఎంసీ డీసీ సమ్మయ్య, ఈవో మనోహర్‌రెడ్డి , ఏసీపీ సర్ధార్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం తదితర అధికారులతో కలిసి దేవాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి పరిశీలించి క్యూలైన్లు, మంచినీళ్లు, పారిశుధ్యం, టాయిలెట్ల నిర్వహణ పై ఎలాంటి అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నేతలు



ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

అడ్డగుట్ట: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను అడ్డగుట్టకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న తరుణంలో అడ్డగుట్ట డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేతలు కాంగ్రెస్ ఎమ్మెల్యేను కలవడం గమనార్హం. దీంతో అడ్డగుట్ట బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారా అనే విషయంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే, డివిజన్ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి భర్త లింగాని శ్రీనివాస్ జన్మదినానికి ఎమ్మెల్యేను ఆహ్వానించేందుకు వెళ్లినట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఎమ్మెల్యే గణేష్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, ఎల్లన్న, మల్లేష్, టీడీపీ సీనియర్ నేత కాసుల సుదర్శన్‌లు ఉన్నారు.

ఎన్నికలపై అనుమానాలను నివృత్తి చేయాలి

లిబర్టీ: ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మళ్లీ లెక్కించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసి తిరిగి లెక్కించి అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం మళ్లీ ఓట్లను లెక్కిస్తే తప్ప వివిధ వర్గాలు, మేధావుల్లో ఉన్న అనుమానాలు నివృత్తి అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈవీఎంలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో మళ్లీ లెక్కిస్తే అనుమానాలు తీరుతాయన్నారు.

ఇన్సూరెన్స్ పేరుతో మోసం

వెంగళరావునగర్: ఇన్సూరెన్స్ ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే వేణుకుమార్ వీఎఫ్ఎక్స్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. కొంతకాలం కిందట అతనికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వచ్చింది. ఈనెల 7న ఎస్‌బీఐ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని అతనికి ఫోన్ వచ్చింది. కార్డు ద్వారా ఇన్సూరెన్స్ ఇస్తున్నట్టు తెలియజేసి వేణుకుమార్‌కు ఓటీపీ పంపి దానిని వివరాలు తెలుసుకున్నారు. ఓటీపీ ఇతర వివరాలు కస్టమర్ కేర్ నెంబర్‌లోని వ్యక్తికి తెలియజేయగా అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.30,582లు డెబిట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. దీంతో బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో శ్రీ సాయి సప్తాహ ఉత్సవాలు భక్తిప్రపత్తుల మధ్య సాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవ రోజైన బుధవారం దేవాలయంలో శ్రీ సిద్ధి వినాయక సేవ, లక్ష్మీనారాయణ కళ్యాణంతో పాటు తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలోని రావి, వేప వృక్షాలకు పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్, సురేష్, హరి, ముక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలోల్లో).. టమాటా రూ.65, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 23, క్యాబేజీ 35, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 85, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 21, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 38, చామగడ్డ 37, మొరంగడ్డ 43, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సకాలంలో విధులకు హాజరుకాకుంటే చర్యలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేసే ఉద్యోగులు సమయానికి విధులకు హాజరుకాకుంటే చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ బుధవారం పేర్కొన్నారు. కాలేజీల అధ్యాపకులు, వివిధ కార్యాలయాల్లో పని చేసే ఆఫీసర్లు, ల్యాబ్ సిబ్బంది, హాస్టల్ వర్కర్స్ సకాలంలో విధులకు హాజరుకాకుంటే తీవ్రంగా పరిగణించి వర్సిటీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన హన్మకొండ సుధాకర్(44) ఆరు నెలలుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతను జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో మౌలాలి–అమ్ముగూడ రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఆగస్టు 6న రవీంద్రభారతిలో గద్దర్ వర్ధంతి సభ



పంజగుట్ట: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీన ప్రజా యుద్ధనౌక గద్దర్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ చైర్మన్, గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలను ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్, ట్రైబ్స్ కో ఆపరేటీవ్ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, గాయకుడు ఏపూరి సోమన్న, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృధ్వీరాజ్ యాదవ్‌లు తెలిపారు. చంద్రబాబు పాలనలో గద్దర్‌ను అంతమొందించేందుకు చూసినా తెలంగాణ సమాజం మొత్తం కలసి ఆయనను బతికించుకుందని గుర్తుచేశారు. ఆగస్టు 6న ఆయన వర్ధంతి సభ కాదని, ఆయన ఆశయాలను సాధించే సభ, ఆయన ఆలోచనలకు పదునుపెట్టే సభగా పేర్కొన్నారు. సామాజిక కళారూపాన్ని ప్రజలకు అందించిన మహానుభావుడు గద్దర్ అన్నారు. అంబేడ్కర్, కాన్షిరామ్ తరువాత భారతదేశం మొత్తం గుర్తించదగ్గ వ్యక్తి గద్దర్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు అందరినీ ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దర్ సహచరులు సి.ఎల్.యాదగిరి, రాందాస్ పాల్గొన్నారు.

జాతరలో ఎటువంటి ఇబ్బందులు రానీయొద్దు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ఈఓ, ప్రతినిధులు

సనత్‌నగర్: మహంకాళి అమ్మవారి జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. ఈ నెల 21న సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర, బోనాల ఉత్సవాలు, 22న నిర్వహించే రంగం కార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ మనోహర్‌రెడ్డి, చైర్మన్ కామేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



అంబేద్కర్ హట్స్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ అంబేద్కర్ హట్స్‌లో సమస్యలు దశలవారీగా పరిష్కరించనున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీచ్చారు. బుధవారం బోర్డు మూడవ వార్డు అంబేద్కర్‌హట్స్‌లో శ్రీగణేష్ పర్యటించారు. తాగునీటి వసతి, దోమల బెడద, ఓపన్‌నాలతో డ్రైనేజి సమస్య, వీధీ కుళాయిల ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. బస్తీలో తాగునీటి సింటెక్స్ ట్యాంకు పగిలిపోయిందని కొత్తది ఏర్పాటు చేయాలని కోరారు. బోర్డు వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే నూతన ట్యాంకు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన వ్యక్తికి ఆర్థిక సహాయం చేసి గాంధీ సూపరిటెండెంట్‌కు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు.

పాఠశాలలో సదుపాయాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలోని ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తు సీపీఐ ఆధ్వర్యంలో మైలార్‌గడ్డ చౌరస్తాలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతు దూద్‌బావి పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతుందన్నారు. పాఠశాల దుస్థితిని వివరిస్తు పక్షం రోజుల క్రితం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించినా నేటి వరకు స్పందన లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సమస్యల కేంద్రాలుగా మారాయని సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, సీఆర్‌పీఎఫ్ నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య పాల్గొన్నారు.

లేబర్ అడ్డాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు

అడ్డగుట్ట: భవన నిర్మాణ కార్మికుల కోసం లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు గౌరీ నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్టలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు లేబర్ అడ్డాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీరు, మూత్రశాలలు లేక ముఖ్యంగా మహిళలు అనేక అవస్థలకు ఎదుర్కొంటూ కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ఈ విషయం అనేక సార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కూడా తమ సమస్యలు పరిష్కారం అవ్వడం లేదని చెప్పుకొస్తున్నారు. సమావేశంలో పాకాల యాదగిరి, బాలరాజు, అంజయ్య, కుమారస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర సందర్భంగా పటిష్ట బందోబస్తు

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరను ప్రశాంతంగా జరుపుకునేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని దీనికి భక్తులు, నిర్వాహకులు సహకరించాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. బుధవారం సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం భవనంలో పలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్షల మంది భక్తులు పాల్గొనే ఈ జాతరలో అలాంటి జాతరను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. జాతర పేరుతో మద్యంసేవించి, డీజేలు ఏర్పాటు చేసి అసభ్య నృత్యాలతో ఇతర భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సర్దార్‌సింగ్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు పరశురాం, నర్సింగ్‌రావు, రాఘవేందర్, శ్రీకాంత్, ఉప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

చిలకలగూడ : ముస్లింలకు పవిత్రమైన మొహర్రం పర్వదినాన్ని చిలకలగూడలోని పలు ప్రాంతాల్లో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సర్వమత సమానత్వాన్ని ఆకాంక్షిస్తు హిందు,ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిలకలగూడ, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాల్లో షర్బత్‌ను ఉచితంగా పంచిపెట్టారు. చిలకలగూడకు చెందిన హఫీజ్, హనీమున్నీషా వంశస్థుల ఆధ్వర్యంలో చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద వేర్వేరుగా ఏర్పాటు చేసిన పీర్లను డప్పుల దరువులతో పురవీధులలో ఊరేగించారు. బుధవారం సాయంత్రం ఒంటెలు, గుర్రాల మీద పీర్లను చిలకలగూడ, మైలార్‌గడ్డ, కిందిబస్తీ, నామాలగుండు, వెంకటేశ్వరనగర్, అన్నానగర్, శ్రీనివాసనగర్, మసీదుగల్లీ తదితర ప్రాంతాలలో ఊరేగించి కర్బలా మైదానంలో నిమజ్జనం చేశారు.



చిలకలగూడలో పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం